15079601

సర్వరూప ధరం శాంతం సర్వనామ ధరం శివం
సచ్చిదానంద రూపం అద్వైతం సత్యంశివం సుందరం.

ప్రేమ స్వరూపులారా,

ఈ చరాచర ప్రపంచమందు కనిపించే సర్వనామములు కూడా శాంత స్వరూపములే. ఈ సమస్త ప్రాణులు ధరించిన ఈ పాంచ భౌతిక శరీరములన్నీ సుందరములే. కారణము సర్వభూతములందు, సర్వప్రాణులందు, సర్వజీవులందు ఏకాత్మ స్వరూపమై ఉండిన సత్యంశివం సుందరం అదే దైవత్వము. కానీ ప్రతి మానవుని యందు సత్యంశివంసుందరం ఈ మూడు ఉండినప్పటికిని మానవుడు తన యొక్క సత్యమును, తన యొక్క శివత్వమును, తన యొక్క సుందరమును తాను గుర్తించుకోలేక పోతున్నాడు.

దీనినే కొన్నివేల సంవత్సరముల క్రితము ప్లేటో చెప్పాడు. Truth goodness and beauty ఈ మూడే జగత్తునకు మూలాధారములని. సత్యము సర్వమునకు ఆధారము. సత్యం త్రికాలబాధ్యం. goodness యిదే నిజమైన దివ్యత్వము. కారణమేమనగా goodness is godliness. ఈ సుందరమైన తత్వాన్ని, ఈ సత్యమైన తత్వాన్ని, ఈ పవిత్రమైన తత్వాన్ని ప్రతి వ్యక్తి గుర్తించినప్పుడే మానవత్వము కొంత వరకు అర్థము చేసుకొనుటకు వీలవుతుంది. ఈనాటి మానవుడు పురాణములు చదువుతున్నాడు. బైబిలు చదువుతున్నాడు. ఖురాను చదువుతున్నాడు. వేద శాస్త్ర యితిహాస పురాణములు చదువుతున్నాడు. బ్రహ్మసూత్రములు, భగవద్గీత పారాయణము చేస్తున్నాడు. ఇవన్నీ కేవలము పల్చని మజ్జిగ వంటివే. అయితే ఆచరణా రూపమైన ప్రేమ తత్వము చక్కగా కాచి చిక్కని క్షీరము వలె ఉంటుంది. ఇలాంటి క్షీరమును వదలి నీవు మజ్జిగ త్రాగుటేమి. ఇందులో ఏమైనా సారమున్నదా? ఆచరణయే మన జీవితమునకు పుష్టి. కేవలము ప్రచారమే ప్రబోధమే, పాండిత్యమే ఇందులోనున్న ఆడంబరము. ఆచరణ ప్రధానము గానీ ప్రచారము కాదు.

సౌఖ్యమను భవింపని నరునకు
ఎంత కలిమి యున్న ఏమి ఫలము
నీరు గతు కుక్క కెంత పాలినా
తృప్తి కలుగ బోదు పిసిని గొట్టు.

ఈనాటి మానవునకు సమస్త సౌభాగ్యములుంటున్నవి. సమస్త విద్యలు ఉంటున్నవి. సమస్త శక్తి సామర్థ్యములు ఉంటున్నవి. కానీ ప్రయోజనం ఏమిటి? కేవలం మానవునియందు లోభత్వము

15079602

ప్రవేశించినప్పుడు ఇన్ని ఉండి కూడా పనికి రాని వాడే అవుతాడు. ఈ కలి ప్రభావము చేత ఆధునిక యుగములో మానవుని యందు లోభత్వము అమితముగా పెరిగిపోయింది. తాను తినడు ఇతరులకు పెట్టడు. పెట్టక పోయినా పరవాలేదు. పరుల సుఖించుట చూచి ఓర్వలేడు. ఇలాంటి మానవ జీవితమును ఈనాడు మానవ జీవితమని పిలువ వచ్చునా? లేక పశుత్వమని చెప్పవచ్చునా! దాచుకునే దోషత్వము, అభివృద్ధి పరచుకునే మూర్ఖత్వము పశువులయందు కూడా లేదు. ఈనాడు దాచుకొనే మూర్ఖత్వము దోచుకునే క్రూరత్వము మనుజులందు మితిమీరి పోయినది.

ఎన్ని సాధనలు చేసినా ఎన్ని జపములు చేసినా ఇవన్నీ కేవలము కృత్రిమమైన రూపమును ధరిస్తున్నది. ప్రేమలేని పూజ విశ్వాసములేని ఆరాధన నిరర్థకమైనవి. ఏ విద్యలు చదవక పోయినా ఏ శాస్త్రములు మనము వినక పోయినా, ఏ గ్రంథములందు ఉన్న అంతరార్థము మనము గుర్తించక పోయినా ప్రేమ, విశ్వాసము రెండు ఉంటే చాలు. మనము దేహము వదలినప్పుడు ఏమి తీసుకు పోతున్నాము. ఈ శరీరము తో ఎన్నో కార్యములు చేస్తున్నాము. శరీర పోషణార్థమై ఎన్నో అవస్థలను గురౌతున్నాము. తాను తన కుటుంబమును సుక్షేమముగా కాపాడు కొనుటకై అనేక శ్రమలు ఓర్చుకుంటున్నాము.

తనకలిమి భంగపుచ్చును
తనకుంగల గౌరవంబు దగ్ధము చేయున్
తనవారల కెడసేయును
జనులకు లోభంబు వలన సర్వము చెడున్.

ఇదే ఈ నాటి కలిలో గొప్ప మహాత్మ్యము. ఈ లోభత్వము కలిలో గొప్ప ఫ్యాషనుగా ఉంటున్నది. త్యాగము ఏ ఒక్కదానియందు ఆవిర్భవించటము లేదు మానవునిలో. కానీ మన భారతీయ సాంప్రదాయమునందు 'న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః'

కలిమి కలిగిన నాడు కైలాసపతియైన
ధిక్కరించి పాపి తిరుగుచుండు
కలిమి తొలగగానె కనిపించు జగతి.

అది తొలగినప్పుడే జగత్తు కనిపిస్తుంది. అది ఉండినంత వరకు జగత్తు కూడా కనిపించదు. ఏమిటి ఈ జగత్తు? ఏమిటి ఈ జీవితము? ఎంతవరకూ ఈ జీవితము? ఈ జీవితములో మనము సాధించేది ఏమిటి? ఏమి సాధించలేము. అన్నీ కదలిపోయే మేఘములే. ఈ వేళ

15079603

వయస్సు నందు ఎన్నో శ్రమలను ఓర్చుకొనుచున్నారు. ఎన్నో విద్యలు చదువుతున్నారు. ఎన్నో పరీక్షలలో పాల్గొంటున్నారు. అంతా అనిత్యం. శాశ్వతమైనది ఒకటే ఒకటి. అదే దైవప్రేమ. ఈ ప్రేమను పొందలేని జీవితము ఎన్ని ఆర్జించి ప్రయోజనము ఏమిటి? ఎంతకాలము బ్రతికినా కట్టకడపటికి వట్టి చేతులతో వెళ్ళవలసిందే.

శతవర్షముల దాక స్థితము చెప్పిరిగాని
నమ్మరాదామాట నెమ్మనమ్మున
బాల్యమందో లేక ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలియందో
ఊరనో అడవినో ఉదక మధ్యంబునో
ఎక్కడో విడిచేది ఎరుకలేదు.
మరణమే నిశ్చయము బుద్ధిమంతుడైన
దేహమున్నంతలో తాను తెలియవలయు

మన జీవితమును ఏలోటు లేకుండా కష్టపడి సంపాయించవలసినదే. గాలి ఏ విధంగా మనము పీల్చుకుంటున్నామో అదే విధముగా దానిని విసర్జించవలసిందే. ఆహారము ఏ విధంగా స్వీకరిస్తున్నామో అదే విధంగా దానిని కూడా విసర్జించవలసిందే. ధనము కూడా సంపాయించవలసిందే. కానీ విసర్జించవలసిందే. దాచిపెట్టుకోటానికి వీలుకాదు. దాచిపెట్టుకోవలసింది ధర్మమే. ఆ ధర్మమే మనకు శాశ్వతమైన ఆస్తి. అలాంటి దానిని మనము ఈనాడు గుర్తించాలి.

ఒక గ్రామములో లోభిను మహాలోభి. లోభి తమ్ముడు మహాలోభి అన్న. వారు కావలసినంత ధనము పెట్టుకున్నారు. కానీ కాస్సైనా గడప దాటి వెళ్ళరు. కడుపునైనా సరైన భోజనము చేయరు. కావలసినదంతా దాచిపెట్టారు. లైటు ఐదు నిముషాలు ఎక్కువ వెలుగుతే కరెంటు ఖర్చవుతుందని భయము. ఒకనాడు సమీప గ్రామములో సమీప బంధువు మరణించాడు. తప్పనిసరిగా పల్లెకు వెళ్ళి మాట్లాడవలసినది ధర్మము. పదిమైళ్ళ దూరము. బస్సు ఎక్కితే ఐదు రూపాయలు ఖర్చవుతుందని నడచుకొని పోవుటకు ప్రయత్నం చేసాడు పెద్దన్న. తెల్లవారి లేచి రెండు గుడ్డలు పెట్టుకున్నాడు. అప్పుడు తమ్ముడికి చెప్పాడు ఒక చిన్న నూనె దీపము వెలిగించమని. దీపము వెలుతురులో ఇవన్నీ సంచిలో సర్దుకున్నాడు. వెళ్ళాడు. ఇతను వెళ్ళిన వెంటనే తమ్ముడు లోభి కదా దీపము ఆర్పివేశాడు. నూనె ఖర్చవుతుందని. ఒక అర్ధగంటకు అన్న తిరిగి వచ్చాడు. మూడుమైళ్ళు నడిచాడు. తిరిగి మూడు మైళ్ళు నడచి తిరిగి వచ్చాడు. ఆరుమైళ్ళు. తలుపు తట్టాడు. ఎవరు తలుపు

15079604

తట్టేది ఆ డిగాడు తమ్ముడు. నేను అన్నను రా అన్నాడు. ఎందుకు వచ్చావు అన్నాడు. నేను పోయిన సమయంలో దీపము ఆర్పమని చెప్పలేదు. అందువలన దీపమువెలుగుతున్నదేమోనని వచ్చాను అన్నాడు. తమ్ముడు చెప్పాడు 'అన్నా నాకు అంత బుద్ధి లేదా। నీవు వెళ్ళిన తక్షణమే దీపము ఆర్పివేశాను. కానీ నీవు మూడు మైళ్ళు వెళ్ళి తిరిగి వచ్చావు. ఆరుమైళ్ళు తిరిగేటప్పటికి చెప్పులు ఎంత అరిగిపోయి ఉంటాయో. నీవు చూచుకోలేదు' అప్పుడు అన్న చెబుతున్నాడు 'తమ్ముడా। నేను తెలివి తక్కువ వాడనా. చెప్పులను మూటకట్టి చంకలో పెట్టుకున్నాను'! ఈ విధమైన లోభత్వము ఉంటే ఈ చెప్పులు ఎందుకు. తాను సుఖపడని ఈ ధన ధాన్యములు ఎందుకు. పరులకు సుఖాన్ని అందించాలి. తానూ సుఖపడాలి. ఈ రెండు లేని ధనము ఏమి ప్రయోజనము

మీరు విద్యలు అభ్యసిస్తున్నారు. ఈ విద్యలు అభ్యసించటము ఉద్యోగముల నిమిత్తము కాదు. సమాజములో, మన గ్రామములో ఈ చదువును సద్వినియోగ పరచాలి. సమాజము యొక్క సంక్షేమమునకు మీ చదువును ఉపయోగపెట్టాలి. కేవలం చదివి డిగ్రీలు తీసుకున్నంత మాత్రమున ప్రయోజనము లేదు. ఇది కేవలము భిక్షాపాత్ర. ఎందుకంటే డిగ్రీ పాత్ర పట్టుకొని ఒక్కొక్క ఆఫీసుకూ వెళ్ళి ఉద్యోగము ఉద్యోగము అని beg చేస్తుంది. మన చదువు మన పాదములపై నిల్చుకోటానికి తగిన కృషి చేయాలి. స్వయం కృషి జరగాలి. మన గ్రామములో అవసరమైన సదుపాయములు చేయాలి. మన గ్రామములో నిత్యము కావలసిన కూరగాయలు పెంచాలి. డ్రైనేజి కట్టించాలి. గ్రామములో బీద వారుంటారు. వారికి పరిశుద్ధత బోధించాలి. రోగములు రాకుండా చూచుకోవాలి. చిన్న పిల్లలకు మనం నేర్చుకున్న విద్యలు నేర్పాలి. ఇతరులకు సహాయము చేయాలి. ఈనాడు మనము పెద్ద పెద్ద డిగ్రీలు తీసుకున్న తక్షణమే ఎంప్లాయిమెంటు ఆఫీసుకు పోయి రిజిస్టరు చేయించుకుంటాము. అదీ ఎక్కువైపోతే విదేశాలకు apply చేస్తాము. ఇది మన చదువుల యొక్క లక్షణమే కాదు. మన గ్రామమును మనం పోషించాలి. నీవు పుట్టింది నీ గ్రామములో. నీవు పెరిగింది గ్రామములో. నీవు చదివినది గ్రామములో. ఈ శక్తులు సర్వము నీ గ్రామము అందించినవే. నీ సమాజము అందించింది. కనుక సమాజమునకు కృతజ్ఞత నందించ నక్కర లేదా। సమాజములో పుట్టాము, సమాజములోనే పెరిగాము, సమాజములోనే అంత్యమవుతున్నాము. సమాజమునకు తగిన కృతజ్ఞతను అందించాలి.

ఈనాడు ఇట్టి విశాల భావములు కోల్పోతున్నారు విద్యార్థులు. నేను నా వారు. కానీ జగత్ ప్రజలగతి ఏమిటి? అందరు భగవంతుని బిడ్డలే. అందరు అన్నదమ్ములే. మనలో మనము ఏ విధమైన కలతలు లేకుండా సహన భావముతో అభివృద్ధికి రావాలి. సహనము, సానుభూతి మనము

పెంచుకోవాలి. ఐకమత్యము చాలా అవసరము. కలసి పని చేయాలి. కలసి మెలగితే కలదు సుఖము అన్నారు. విద్యార్థులలో ఈనాడు విశాలభావములు రావాలి. విశాలహృదయము మనము పెంచుకోవాలి. హృదయము ఎక్కడుంటున్నది దేహములో. ఎడమవైపు ఉంటున్నది గుండె. గుండె దేహమునకు main switch వంటిది. హృదయము సర్వత్రా ఉంటున్నది. హృదయమునకు పరిమితమే లేదు మన హృదయము ఎక్కడ వరకూ ప్రయాణమవుతుందో అక్కడ వారందరు మన బంధువులే. ఈ విధమైన సహనభావము చేత ఐకమత్యముతో మనము జీవించాలి. చదువు కేవలం పొట్ట కూటికోసం కాదు. చదువు సంస్కారము కోసం. ఈ సంస్కారము మనం అభివృద్ధి పరచుకుంటే మన పొట్టకూటి జరుగుతూనే ఉంటుంది. నిత్యము ప్రార్థన చేస్తున్నారు. ధర్మో రక్షతి రక్షితః. ధర్మాన్ని నీవు రక్షిస్తూ పోతే ఆ ధర్మమే నిన్ను రక్షిస్తుంది. కనుక మనము ధర్మాన్ని సమాజము లో సరైన రీతిగా నడిపించాలి.

విద్యార్థులారా! భారతీయ సంస్కృతిగాని విదేశ సంస్కృతిగాని అంతా యింతా పల్లెలలో ఉందిగాని పట్టణములలో లేదు. పల్లెలలో నున్న ధర్మము, న్యాయము, సహనము, ప్రేమ పట్టణములలో లేదు. టౌన్లలో కోర్టులు తయారైనాయి. బ్యాంకులు తయారైనాయి. యూనివర్సిటీలు తయారైనాయి. ఎన్నెన్నో వచ్చాయి. ఇన్ని ఉండిన పట్టణములలో జరిగే అన్యాయ అక్రమ అనాచారములు అంత ఇంత కాదు. పల్లెలలో నీతి నిజాయితీ ఉంటున్నది. పల్లెలందు వెనుకబడిన వారుంటారు. వారిలో నున్న సత్య ధర్మములు పట్టణము వారిలో లేవు. వారు మన సంస్కృతిని కాపాడుతూ వస్తున్నారు. ఈనాడు మనం చదివినందుకు ఏమి చేస్తున్నాం. మన సంస్కృతిని కాల్చి వేస్తున్నాము. మన నీతి నిజాయితీలను మంట పెడుతున్నాము. మానవత్వమునే మంట గలుపుతున్నాము. ఏమిటి మానవత్వము? మానవుడు పుట్టి లక్షల సంవత్సరములైపోయింది. కాని మానవత్వము యింకా మానవుని నుండి పుట్టలేదు. మానవుడు పుట్టాడు కాని మానవత్వము పుట్టలేదు. ఇంకెప్పుడు పుట్టేది మానవత్వము. ఎన్ని జన్మలు నశించాయో ఎన్ని జన్మలు రాబోతున్నాయో. మానవులతో బాటు మానవత్వము పుట్టాలి. సత్యమును పలకాలి. సత్యము పలికేవాన్ని ఎక్కడా కనిపించటం లేదు. నోరు విప్పితే అసత్యమే. చేయి పెడితే అధర్మమే ఇది మానవత్వము ఎట్లా అవుతుంది? పశువులకు, పక్షులకు నీతి నిజాయితీ ఉంటున్నాయి. ఒక season reason ఉంటున్నాయి. కాని మానవుడుగా పుట్టిన వానికి no reason no season. ఇంకను చదువులు ఎందుకోసం. ఎందుకీ చదువులు చదవాలి. పనికిరాని చదువులు ఎందుకు చదవాలి. సమాజమునకు ఉపయోగకరమైన చదువులు చదవాలి. మన

15079606

మానవత్వము పెంపొందింపచేసే చదువు చదవాలి. మానవునికి మానవునికి ఉన్న సంబంధ బాంధవ్యము పెంచుకునే చదువులు చదవాలి.

ఈనాడు మానవునికి మానవునికి మధ్య ద్వేషము. గ్రామమునకు గ్రామమునకు మధ్య ద్వేషము, రాష్ట్రమునకు రాష్ట్రమునకు మధ్య ద్వేషము. దేశమునకు దేశమునకు ద్వేషము ఎట్లా లేకుండా పోతుంది. నీ దేశములో, నీ రాష్ట్రములో, నీ గ్రామములో కావలసినంత ద్వేషము పెంచుకుంటున్నారు. ఎక్కడో బయటి దేశము వారు మన దేశముపై పడుతున్నారంటే చెప్పుకోటమే అవమానము. మొట్టమొదట నీ యింటిని నీవు చక్క చేసుకో. నీ గ్రామము నీవు చక్క చేసుకో. నీ రాష్ట్రము నీవు చక్క చేసుకో. ఇంటిలోనే ఉంటున్నాయి కావలసినన్ని కలహాలు. దీనిని నిలుపుకోటానికి చేతకాకుండా ఉంది. నీవు ఎట్లా విదేశముల యొక్క దీనిని ఏ విధముగా నిలుపగలవు. నీన ఏశక్తి ఉంది. మొట్టమొదట నీవు యింటిని నిలుపుకో. నీ మానవత్వము నీవు పోషించుకో. అందరిని దైవము యొక్క బిడ్డలుగా భావించు. ఇదే నిజముగా విద్యార్థులు నేర్చవలసిన చదువు. ఎక్కడికి పోయినా ధనము ధనము. ఈ ధనము ఎందుకు కాల్చటానికా! ధనమును ఏమి చేస్తున్నారు. దేశమునకు ఉపకారము చేస్తున్నారా? పదిమందికైనా సహాయము చేస్తున్నారా? విద్యావిషయములకు అభివృద్ధికి వినియోగిస్తున్నారా? ఏమీ చేయటం లేదు. ఈ ధనము కేవలము గుంటలో పెట్టిన ~~ధన~~ మట్టివంటిది. కనుక మనము ధనము కొరకు జీవితము అర్పితము చేయకూడదు. దయకోసము, ప్రేమ కోసము మన జీవితమును అర్పితము చేయాలి. దేహము కోసము ధనము అర్పితము చేయాలి. మానం కోసం ధనము అర్పితము చేయాలి. దైవం కోసము దేహము, ధనము, మానము సర్వం అర్పితము చేయాలి. సత్యమును నిలుపుకో. ధర్మమును ఆచరించు. మానవత్వమునకు ఈ రెండే ప్రధానమైనవి. ఎలాంటి పరిస్థితి వచ్చినను, నిన్ను జైలులో పెట్టే పరిస్థితి వచ్చినా సత్యమును వదలవద్దు. కంఠము కోస్తానంటారు. కంఠము కోసుకో నేను సత్యము వదలను హరిశ్చంద్రుని ఆధారముగా తీసుకోండి. ఆ సత్యమే సర్వము రక్షించి కోల్పోయిన తన రాజ్యమును తనకు అందించింది. ఈ సత్యమునకు ఎరువు ఏమిటి? అదే ప్రేమ. కనుక ప్రేమను మనం పెంచుకోవాలి.

ఈ ప్రేమను పరిమితంగా చేసుకోకూడదు. నేను నా కుటుంబము అని పరిమితము కాకూడదు. నేను నా కుటుంబము అనుకుంటే అరణ్యములో పోయి కూర్చో. నీవు ఊరిలో ఎందుకుండాలి. సమాజములో ఎందుకుండాలి. సమాజములో నున్నందుకు సమాజ క్షేమము కోరాలి. సమాజములో ఉంటుండి నేను నా కుటుంబము అంటుంటే ప్రత్యేకమైన అంటు జబ్బు

వచ్చిన వానిగా అయిపోతావు. అందరితో కూడాలి. ఐకమత్యము పెంచుకోవాలి. నేను నా కుటుంబమనే అంటువ్యాధి మనం సంపాయించుకో కూడదు. అందరు ఉండాలి. ఇలాంటి భావములు ఈనాటి విద్యార్థులు పెంచుకుంటే భావి భారతోద్ధారకులుగా తయారౌతారు. ప్రాచీన కాలమునుండి భారత దేశములో ఆవిర్భవించిన ఈ సత్యధర్మములను పోషించే ఆదర్శమూర్తులుగా మీరు తయారు కావాలి.

విద్యార్థులారా మీరే భావి భారతోద్ధారకులు. మీరే future leaders and pleaders. మీరు సత్యము తెలుసుకోండి. pleadership లో పెడమార్గములో పోకూడదు. ఈనాటి లీడర్‌షిప్ ఎలా ఉందంటే సాక్షాత్ హరిశ్చంద్రుడు వచ్చినా అబద్ధాలు ఆడిస్తాడు లీడరు. ఇది ఈనాటి కలిప్రభావము. అందువలనే ఈనాడు హరిశ్చంద్రులు ఎవరు లేరు. ఈ భయమునకు హరిశ్చంద్రులు పారిపోయారు కొండలకు. సత్యము పరుగెత్తి పోయింది. ఉన్నదంతా అసత్యమే. ధర్మము పరుగెత్తి పోయింది. ఉన్నదంతా అధర్మమే. మనము దీనిని ఈనాడు పుష్టి చేయాలి. ఇట్లా చేయాలి. మనం ఆచరించాలి. నోటితో చెప్పటం కాదు. మనం ఆచరణ రూపంలో ప్రవేశపెట్టాలి. హృదయములో నున్నది మాటలో, మాటలో నున్నది క్రియలో మనము ఆచరించాలి. సత్యధర్మములను సరైన మార్గములో నుంచుకున్నప్పుడే విద్యార్థులుగా తయారౌతారు లేకపోయిన మీరు విషయార్థులైపోతారు.

తాను ఎంతో ఆదర్శంగా, ఆప్యాయంగా అన్నదమ్ములకంటె వారిని చూచుకుంటూ వారి ప్రేమను అమితంగా చేసి వారియందున్న దుఃఖమును హరింప చేస్తుంది. కేవలం మన Institute అని చెప్పుకోటం కాదు. సత్యముగా నిత్యము జరుగుతూనే ఉంటున్నది. మిగిలిన Institutes లో శ్రీమంతులనుండి డొనేషన్లు ఇలాంటివి మనము చూస్తూనే ఉన్నాము. కాని మన Institute లో ప్రేమయే సుంకము. అలాంటి వారికి నేను ఎప్పుడు ప్రాధాన్యము ఇస్తాను. మీరు విన్నారు. రెండవ విద్యార్థి సంస్కృతములో మాట్లాడాడు. ఆ అబ్బాయికి వేరొక ఆధారము లేదు. అవ్వతాత ఇద్దరు పోషిస్తున్నారు. తల్లిదండ్రులిద్దరు లేరు. ఇలాంటి పిల్లలను ఇక్కడను రక్షించి అన్ని విధముల అభివృద్ధి పరచి ఆ పిల్లవాడు సంస్కృతములో మాట్లాడాడంటే ఎంత దుఃఖమును మరచిపోయి ఉండాలి మీరు యోచన చేసుకోండి. అట్టి దుఃఖమును మరపించి ఆనందమును పెంచి తల్లిదండ్రుల లేనిలోటు తీర్చేదే సాయి ప్రధాన సంకల్పము. అదే నేను చేస్తున్నాను. మిమ్మల్ని చేయమంటున్నాను. మీరు కూడా అంతే ఎవరైనా ఇలాంటివారు దొరితే వారికి తగిన సహాయము చేసి ఉన్నత స్థాయికి తెప్పించే ప్రయత్నం మీరు చేయాలి. బయట చూస్తున్నారు. ఇంజనీరింగు మెడికల్ కాలేజీలు. మహానరకాలు. కొత్తవారు ప్రవేశిస్తే ఒక్క వారం

15079608

కంటె ఉండలేరు. కొత్త పిల్లలను నానా విధములుగా బాధపెడితే చదువు విడిచి పోతున్నారు. ఇది senior boys చేయవలసినది. Junior boys ను ఎంతో ఆదరించాలి. స్వంత సోదరుల మాదిరి చూచుకోవాలి. వారి అనానుకూలములు తీర్చాలి. వారి అశాంతి నిర్మూలనం చేయాలి. సంతోష శాంతులను పెంచాలి. అదే నేను ఇక్కడ చేస్తున్నాను. చేయమని చెబుతున్నాను. education free అయినా ఇలాంటి పిల్లలను భోజనమునకు, books scholarship ఇస్తున్నాను. games, examination, lib దేనికి నయాపైస ఫీజు లేదు. ఈ విధముగా విద్య పిల్లలకు అందిస్తున్నప్పుడు ఎంత ఉన్నతమైన ఆదర్శవంతమైన విద్యార్థులుగా రావాలి. ideal boys గా తయారు కావాలి. ఎవరైనా బిక్షము ఎత్తుతుంటే నాయనా నీవు బిక్షము ఎత్తకూడదు నీకు ఏమి గతి పట్టింది, రా మార్గము చూపిస్తానని ఉద్యోగము చూపించాలి లేక సహాయము చేయాలి.

ఒకానొక సమయంలో జీసస్ ఒకరైన వానికి రెండు చేపలు ఇచ్చాడు. దినము ఆ విధంగా చేపలు ఇవ్వటానికి ఎలా వీలవుతుంది. ఇది మంచిది కాదని ఒక వలకొని ఆయకిచ్చాడు. ఈ వల తీసుకొని జీవితము గడుపుకో. అట్లే మన పిల్లలు ఆవిధముగా చేయాలి. జీవనోపాధికి తగిన సహాయము చేయాలి. ఎందుకంటే అందరు మన సోదరులు. మన Institute పిల్లలందరు brothers and sisters. ఆ ప్రేమను మీరు పెంచుకోవాలి. ఆప్యాయత మరు విశాలము గావించుకోవాలి. హృదయము విశాలము చేసుకోవాలి. అదే మన విద్యార్థులు నేర్చుకోవలసింది. అహంకారమునకు గానీ ఆడంబరమునకు గానీ ఏమాత్రము అవకాశము ఇవ్వకూడదు. అమిత ప్రేమకు అవకాశమివ్వాలి. ఆదర్శమునకవకాశమివ్వాలి. అప్పుడే అలాంటి పిల్లలు అభివృద్ధి లోకి రాగలరు. పూర్వము అభివృద్ధికి వచ్చింది ఇలాంటి వారే. పూర్వము బ్రిటిషు దేశములో ఒకవ్యక్తి బూట్ పాలిష్ చేసేవాడు. బూట్లు పాలిష్ చేసి డబ్బు తీసుకొని god bless you అనేవాడు. ఇంకొక ఆయన కవర్లపై ఎడ్రస్సులు వ్రాసేవాడు. ఎడ్రస్సు వ్రాసి ఇస్తే పెన్నీ ఇచ్చేవారు. దానికి thanks చెప్పి god bless you అనేవాడు. అతను మంచి హృదయము కలిగినవాడు. ఆ భక్తి విశ్వాసములతో జీవించటంచేత బ్రిటన్ ప్రైమినిస్టరు అయిపోయాడు. ఎంతటి ఉన్నత స్థాయి. మనలో నున్న వినయ విధేయతలకే ఉన్నత స్థానము వస్తుంది. చదువుకు కాదు. చర్చిల్ మీకు తెలుసు. ఆయన ఏ విద్యలు చదవలేదు. మిలట్రీలో చేరాడు. అతనికి గొప్ప అభివృద్ధి వచ్చింది. ఈ విధంగా గొప్ప పేరుప్రఖ్యాతులు గాంచిన వ్యక్తులందరికి వినయ విధేయతలే మూలకారణము.

15079609

విద్యార్థులారా వినయమే చాలా గొప్పది. వినయమే విద్యార్థికి గొప్పకిరీటము. ఇలాంటి పిల్లలు మీక్లాసులో మీ room meetsగా ఉంటుంటే వారికి సహాయము చేయండి. వారు మరచిన దుఃఖమునకు అవకాశము ఇవ్వకండి - దుఃఖమును మరచిపోయే ఆనందమును ఇవ్వాలి. ఇప్పుడు ఈ అబ్బాయి మెడలో చైన్ వేయటం వలన ఎంత ఆనందము వచ్చింది. తల్లితండ్రులను మరచిపోయాడు పాపం. అలాంటివి మీరు చేసి చూపించాలి. దీని కోసమే నేను చేస్తున్నాను. నేను ఎప్పుడు తలచటము, చెప్పటము, చేయటము మూడింటి ఏకత్వము చేస్తాను. కనుకనే నాకు చెప్పటానికి అధికారముంది. మీరందరు మనుష్యులుగా బ్రతకండి. పశువులుగా బ్రతకకండి. కాఠిన్య హృదయాలను పెంచుకోకండి. కరగి ప్రవహించే కరుణా హృదయముండాలి.